క్లుప్తంగా

విజయదుర్గా పీఠంలో పౌర్ణమి పూజలు



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గ పీఠంలో సోమవారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటివ్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో విజయదుర్గ అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అష్టోత్తర, సహస్రనామాలతో మహిళలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో విజయదుర్గ సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, పీఠం పీఆర్వో బాబి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మి అమ్మవారికి జలాభిషేకం

కపిలేశ్వరపురం: అంగరలో వేంచేసిన శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి సోమవారం 108 కళశాలతో తీసుకొచ్చిన పుణ్య జలాలతో అభిషేకం చేశారు. జాతర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. చేనేత కార్మికులు ఆరాధ్యదైవంగా భావించే అమ్మవారిని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



భోగి మంట వెలిగించి పూజ చేస్తున్న మంత్రి సుభాష్ దంపతులు

రామచంద్రపురం: భోగి పండగ భోగ భాగ్యాలు అందిస్తూ రాష్ట్ర ప్రజలందరి జీవితాలలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని భగవంతుని కోరుకున్నానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురంలో మంత్రి సుభాష్ దంపతులు, ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం తెల్లవారుజామునే కుటుంబ సమేతంగా భోగి మంటలను వెలిగించారు. ప్రజల్లో ఉన్న అశాంతి తొలగిపోయి, కొత్త వెలుగులు, ఆనందాలు, సిరి సంపదలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వేద పండితుల ఆశీస్సులు తీసుకుని, పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ భోగి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన అయినవిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో పుష్పాకృతిలో విఘ్నేశ్వరుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం సంక్రాంతి సందర్భంగా సోమవారం దేశం నలుమూలలు నుంచి అత్యధిక సంఖ్యలో భక్తుల దర్శించుకున్నారు. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు అభిషేకాలు జరిపారు. స్వామి వారి ఆలయ ప్రాంగణం రంగవల్లులు, వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భోగి మంటలు వేశారు. హరిదాసులు, గారడీ, వివిధ నృత్య ప్రదర్శనలు, డప్పు వ్యాయిద్యాలు ఏర్పాటు చేశారు. సుమారు 6,420 అన్నప్రసాదం స్వీకరించారు. స్వామికి సోమవారం ఒక్క రోజు రూ.6,50,409 లభించినట్లు ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామివారిని బుల్లితెర నటులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అన్‌స్టాపబుల్ పుస్తకం ఆవిష్కరణ


ఆలమూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అన్‌స్టాపబుల్ పుస్తక ఆవిష్కరణ జరిగింది. జేఈఈ, ఎన్ఈఈటీ ప్రవేశ పరీక్షల్లో సులభంగా ర్యాంకులను సాధించేందుకు వీలుగా ఆలమూరు మండలంలోని చింతలూరుకు చెందిన ఎస్‌బీవీఎస్ ఎడ్యుకేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సుబ్బు ఇన్నోవేటివ్ క్లాస్ అధినేత నామాల బాల వెంకట సుబ్బారావు స్వయంగా ఈ పుస్తకాన్ని రాశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా ఈ పుస్తకాన్ని పూర్వ గురువులతో ఆవిష్కరించారు. అనంతరం సహచర మిత్రులకు ఈ అన్‌స్టాపబుల్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు.

భోగి భాగ్యాలు

- సంప్రదాయబద్ధంగా భోగి పండుగ
- గ్రామాల్లో సందడి వాతావరణం
- జోరుగా కోడి పందేలు



రాయవరంలో భోగి మంట వేసేందుకు పిడకలు సిద్ధం చేసిన కాలనీ వాసులు



వెదురుపాకలో చిత్రా దీపిక తీర్చిదిద్దిన సంక్రాంతి ముగ్గు



కూళ్లలో భోగిమంట వద్ద సందడి చేస్తున్న చిన్నారులు

కపిలేశ్వరపురం: భోగభాగ్యాలు కలిగించే భోగి పండగను సోమవారం మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో వైభవంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి పండుగకు ఇంటికొచ్చిన చిన్నారులు సందడి చేశారు. ఇంటిల్లిపాదీ ఉదయాన్నే పుణ్య స్నానాలను ఆచరించి నూతన వస్త్రాలను ధరించారు. గోవు పిడకలతో తయారు చేసిన దండలను భోగి మంటల్లో వేసి సూర్య నమస్కారం చేసుకున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో భోగి మంటలు వేయడంతో గ్రామాలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయి. చిన్నారులు పతంగులను ఎగురవేస్తూ సరదాగా గడిపారు.

దుర్గుణాల దహనమే ‘భోగి’

రాయవరం: మనలో ఉన్న దుర్గుణాలను విడనాడే మానసిక దహన ప్రక్రియే భోగి పర్వదినమని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. భోగి పండుగ సందర్భంగా ఆయన పీఠంలో సోమవారం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలు, ధార్మిక వికాసానికి పండుగలు వారధిగా నిలుస్తాయని గాడ్ పేర్కొన్నారు. పీఠంలో భోగిపండుగను పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా...

భోగి పండగను మండలంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వీధివీధి రంగవల్లులతో నిండిపోగా, పలుచోట్ల రంగురంగుల జెండాలతో అలంకరించారు. కలప, దుంగలతో భోగి మంట వేశారు. వేకువజామునే చిన్నారుల నుంచి పెద్దల వరకు మంగళస్నానాలు చేసిన అనంతరం భోగి మంట వద్ద మంటకాగారు. చిన్నారులు భోగి పిడకల దండలను భోగిమంటల్లో వేశారు. భోగి సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్త అల్లుళ్లతో ఇళ్లన్నీ సందడిగా మారాయి. పలుచోట్ల చిన్నారులు, యువతులు ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచి, మధ్యలో రాధాగోపాలకృష్ణ బొమ్మను ఉంచి పూజలు నిర్వహించారు. చిన్నారులు గొబ్బిపాటలు పాడుకుంటూ గొబ్బెమ్మల చుట్టూ నృత్యాలు చేశారు.

వైభవంగా భోగి వేడుకలు

కె.గంగవరం: గ్రామాలు సంక్రాంతి శోభతో కళకళలాతున్నాయి. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న పిల్లలు, బంధువులు, అల్లుళ్ల గ్రామాలకు చేరుకోవడంతో సందడి నెలకొంది. ఇళ్లలో నుంచి ఘుమఘుమాడే పిండి వంట సువాసనలు వెదజల్లుతున్నాయి. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ సంప్రదాయ పద్ధతిలో ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచే భోగి మంటలు వేశారు. చిన్నపిల్లలు, యువకులు, పెద్దలు నలుగు పెట్టుకుని తలంటు స్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి స్థానికంగా ఉన్న దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. చిన్నపిల్లలు భోగిపిడకలను తెచ్చి మంటల్లో వేసి సందడి చేశారు. కోటిపల్లిలో



దుగ్గుదుర్రులో భోగి మంట వేస్తున్న యువకులు

80 అడుగుల భోగి పిడకల దండను మంటలో వేసి చిన్నారులు సందడి చేశారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో సోమవారం భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారుజామునే యువకులు, పెద్దలు గత నాలుగు రోజులుగా సేకరించిన కలప, పిడకలతో ప్రతి గ్రామంలోనూ ప్రధాన కూడళ్లలో భోగి మంటలు వేశారు. సంక్రాంతి పండగల్లో భోగి పండగే మొదటిది. చిమ్మచీకట్లను చీల్చుకుంటూ వెలుగులు నింపే భోగిమంటలు పాతకు స్వస్తి పలికి కొత్తదనానికి నాంది పలుకుతుందని గామీణ ప్రజల విశ్వాసం. ఆవుపేడతో తయారుచేసిన భోగి పిడకలను చిన్నారులు దండలుగా గుచ్చి భోగిమంటల్లో వేశారు. మంటల్లో నీళ్ల కాచుకుని తెలతెలవారక ముందే తలారా స్నానం చేసి కొత్త దుస్తులు ధరించారు. చుట్టుపక్కల వారిని పిలిచి తమ ఇంట చిన్నారులకు డబ్బులు, రేగిపళ్లు, పువ్వులు, అక్షతలు కలిపి భోగిపళ్లు పోసే కార్యక్రమం గ్రామాల్లో ఇంటింట వేడుకగా జరిగింది.

భోగి మంటలతో పండగ ఉత్సాహం

రామచంద్రపురం రూరల్: భోగి పండుగతో మండలంలోని గ్రామాలు, రామచంద్రపురం పట్టణం కొత్త కళను సంతరించుకున్నాయి. గ్రామాల్లో మంచు పరదాల మాటున తెలతెలవారక ముందే వెచ్చని భోగి మంటలను వెలిగించారు. కొత్త బట్టలు ధరించిన చిన్నారులు, పెద్దలు భోగి పిడకలను తీసుకువచ్చి భోగి మంటల్లో వేసి, భక్తితో నమస్కరించుకున్నారు. చిన్నారులకు భోగిపళ్లు వేసి ముచ్చట తీర్చుకున్నారు. రకరకాల పిండి వంటలతో ప్రతి ఇంటిలోను బంధువులతో సందడి నెలకొంది.



ద్రాక్షారామలో భోగి పిడకల దండలు వేసి భోగి మంటకు నమస్కరిస్తున్న కుటుంబం

1000 అడుగుల భోగి పిడకల దండతో..

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఒక కుటుంబం 1000 అడుగుల పిడకల దండతో భోగి మంట వేసి సందడి చేసింది. ద్రాక్షారామకు చెందిన కోటిపల్లి సత్యనారాయణ కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామ పెద్దల సహకారంతో వారి ఇంటి నుంచి సుమారు 100 మంది కలసి అతి పెద్ద భోగి పిడకల దండతో భీమేశ్వరాలయ ప్రాంగణం వరకు ప్రదర్శనగా వెళ్లడంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు. కొందరు ఈ క్రతువులో తామూ ఒక చేయి వేయాలని స్వచ్ఛందంగా వచ్చి పిడకల దండను సాయం పట్టారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, న్యాయవాది కోటిపల్లి లోవరాజు, కుక్కల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



1000 అడుగుల పిడకల దండతో కోటిపల్లి సత్యనారాయణ కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు

2019లో 300 అడుగుల నుంచి ప్రారంభం

మేము, మా పిల్లలు అందరం కలసి రెండు నెలల పాటు శ్రమించి ఈ 1000 అడుగుల పిడకల దండను తయారు చేశాం. 2019 సంవత్సరంలో 300 అడుగుల దండతో ప్రారంభించి ఏడాది ఏడాదికీ పెంచుకుంటూ 1000 అడుగుల దండ చేశాం. అంత భారీగా తయారు చేసిన దండను గ్రామంలో ప్రదర్శిస్తూ తీసుకుని వెళ్లి భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంట వేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కోటిపల్లి సత్యనారాయణ, కోటిపల్లి వీర్రాజు, కోటిపల్లి లోవరాజు కృతజ్ఞతలు తెలిపారు.

పందెం రాయుళ్ల బరితెగింపు

- యథేచ్ఛగా కోడి పందేలు, గుండాట
- పట్టించుకోని పోలీసులు



ఉ(ట్రు)మిల్లిలో కోడి పందేలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు

మండపేట: సంక్రాంతిని పురస్కరించుకుని మండపేట పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో కోడి పందేలు, గుండాట యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. గతవారం రోజులుగా కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడలు ఆడవద్దని, నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసుల హెచ్చరికలు జారీ చేసినప్పటికీ పెడచెవిన పెట్టి నిర్వాహకులు బరులు సిద్ధం చేశారు. భోగి సందర్భంగా సోమవారం మండపేట గొల్లపుంత రోడ్డులోని లే అవుట్, సంఘం పుంత రోడ్డు, మండలంలోని మారేడుబాక పుంతరోడ్డు, కేశవరం, ద్వారపూడి గ్రామాలతో పాటు ఏడిద-దుళ్ల రోడ్డులోని తామర చెరువు గట్టు వద్ద యథేచ్ఛగా కోడి పందేలు, గుండాట నిర్వహించారు. కోడి పందేల్లో రూ.లక్షల్లో బెట్టింగులు జరిగాయి. ఒక్కో బరి వద్ద 70 నుంచి 100 పందెం కోళ్ల కాలు దువ్వాయి. ఈ పందేల్లో వందలాది కోళ్ల రక్తమోడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. వాటిని కోశలుగా కోసి పందెం రాయుళ్ల సొమ్ములు చేసుకున్నారు. ఈ పందేల పక్కనే టెంట్లు వేసి గుండాట బోర్డులు ఏర్పాటు చేశారు. ఒక్కో బరి వద్ద 5 నుంచి 7 వరకూ గుండాట బోర్డులను నడిపించారు. పండుగ మూడు రోజులూ 24 గంటలూ పందేలు, గుండాట నిర్వహించేందుకు నిర్వాహకులు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. బరుల వద్ద మందుబాబులకు ఇబ్బంది కలుగకుండా తినబండారాల దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పందెం రాయుళ్ల బరితెగించి కోడి పందేలు, గుండాట బాహాటంగా నిర్వహించినా పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.





మండపేటలో గుండాట, కోడి పందేలు ఆడుతున్న దృశ్యం

జోరుగా కోడి పందేలు.. గుండాటలు

రామచంద్రపురం రూరల్: సంక్రాంతి పండగ పురస్కరించుకుని రామచంద్రపురం మండలంలో సోమవారం జోరుగా కోడి పందేలు, గుండాటలు నిర్వహించారు. ఉట్రుమిల్లి, ఏరుపల్లి, హసన్‌బాద, వెంకటాయపాలెం తదితర గ్రామాల్లో భారీ సెట్టింగులు వేసి మరీ కోడి పందేలు, జూద క్రీడలను నిర్వహించారు.

అల.. పేదల సేవలో..

- పేదలకు చీరలు, స్వీట్లు, దుప్పట్ల పంపిణీ
- దాతృత్వం చాటిన దాతలు



మండపేటలో పేదలకు వస్త్రదానం చేస్తున్న యువజన సహాయ సంఘం సభ్యులు

మండపేట: సంక్రాంతి వచ్చిందంటే మండపేట పట్టణంలో నిరుపేదలకు పెద్ద పండుగే. పట్టణంలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు ఏటా సంక్రాంతికి నిరుపేదల సేవలో తరిస్తారు. పట్టణానికి చెందిన పలువురు 1979లో మండపేట యువజన సహాయ సంఘం పేరిట సేవాసంస్థను స్థాపించి నాటి నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భోగి సందర్భంగా సోమవారం మండపేట యువజన సహాయ సంఘం ఆధ్వర్యంలో వల్లూరి వీధిలోని పెద్దనూతి వద్ద నిరుపేదలు, అనాథలు, అభాగ్యులకు చీరలు, దుప్పట్లు పంచారు. సంఘ సభ్యులు వల్లూరి సంజీవరావు, అబ్బాస్‌హుస్సేన్, వంక విశ్వనాథం, వల్లూరి సత్యనారాయణ చేతుల మీదుగా 400 మందికి చీరలు, 800 మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్టు సంఘ సభ్యుడు కట్టుమేను రామకృష్ణ తెలిపారు. అలాగే ఐఎస్‌డీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇనపకోళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిరుపేదలకు స్వీట్లు పంపిణీ చేశారు.

పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ

మండపేట: పండుగ పర్వదినాల్లో నిరు పేదలకు సాయం చేస్తే ఎంతో పుణ్యమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిరుకూరి బాపిరాజు పేర్కొన్నారు. భోగి పండగను పురస్కరించుకుని సోమవారం లయన్స్ క్లబ్ సభ్యులు పేదలకు వస్త్రదానం చేశారు.



పేదలకు వస్త్రదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సత్యశ్రీ రోడ్డులోని లయన్స్ క్లబ్ కార్యాలయం వద్ద సుమారు 200 మంది పేదలకు క్లబ్ అధ్యక్షుడు బాపిరాజు చేతుల మీదుగా చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి చెన్నా రాంబాబు, సభ్యులు గుండు వీర తాతరాజు, కోనే వీర్రాజు, బీవీవీ సత్యనారాయణ, కేవీవీ సత్యనారాయణ, గంద్రోతుల రామకృష్ణ, సత్తి భాస్కర రెడ్డి, కాళ్ల సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

రాయవరం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా రాయవరంలో ఈ నెల 11న ప్రారంభమైన రాయవరం ప్రీమియం లీగ్ సీజన్-8 క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ టోర్నీ నిర్వహిస్తున్నారు. రాయవరం గ్రామానికి చెందిన క్రీడాకారులు ఐదు టీమ్‌లుగా పోటీ పడుతున్నారు. పరిమిత పది ఓవర్ల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా రోజుకు ఎనిమిది లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రతి లీగ్ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందజేస్తున్నారు. పాయింట్ల పద్ధతిలో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్లో 16న తలపడనున్నాయి. ఫైనల్ మ్యాచ్ మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తామని నిర్వాహకులు రొంగల సాయి, ఎ.సత్తిబాబు, అమీర్, సలీమ్, సురేష్, వినయ్ తెలిపారు. ఫైనల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డులు అందజేయనున్నట్లు చెప్పారు.

కోడిపందేలు ఆడుతున్న నలుగురి అరెస్టు

రాయవరం: మండలంలో కోడిపందేలు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు సోమవారం తెలిపారు. రాయవరం శివారులో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని, కూర్మాపురంలో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి నాలుగు కోళ్లు, నాలుగు కత్తులు, రూ.3 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

మండలంలోని మోటూరు గ్రామంలోని వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు. వీరి నుంచి రూ.7550 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నట్టు చెప్పారు.

ఘనంగా గోదా రంగనాథుల కల్యాణం

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న విష్ణాలయాలు, వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో సోమవారం గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఏటా మార్గశిర మాసం ధనుస్సంక్రాంతి మొదలుకొని ధనుర్మాసంలో నెల రోజుల పాటు గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి చివరి రోజున గోదా రంగనాథులకు కల్యాణం నిర్వహిస్తుంటారు. కోలంకలోని శ్రీ, భూ సమేత కేశవస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు, ప్రశాంతాచార్యులు ఆధ్వర్యంలోనూ, గొల్లపాలెం కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు సర్వే రామకృష్ణామాచార్యులు, సర్వే అరవింద్‌ల ఆధ్వర్యంలోనూ పురోహితులు కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు వరదా శేషారావు మాట్లాడుతూ గ్రామ సౌభాగ్యం, లోక కల్యాణార్థం ఏటా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని గొల్లపాలెం వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు శీల, కాజులూరు, అయితపూడి గ్రామాలలోని వేంకటేశ్వరస్వామి ఆలయంల్లోనూ భక్తులు గోదాదేవి, రంగనాథుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్త కమిటీ సభ్యులు వరదా వేంకటేశ్వరరావు, రామలక్ష్మీభవాని, వరదా వెంకటనాగేశ్వరరావు, పచ్చిపులుసు సూర్యనారాయణ, సురేష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



గొల్లపాలెంలో మాంగల్యధారణ ఘట్టంలో అమ్మవారి మంగళ సూత్రాలను దర్శనార్థం భక్తులకు చూపిస్తున్న పురోహితులు

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుడు సంపర లక్ష్మీ నరసింహ భాస్కర శ్రీనివాస్ పర్యవేక్షణలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. ధనుర్మాస పూజల్లో చివరి ఘట్టంగా గోదాదేవి కల్యాణం నిర్వహించినట్టు అర్చకులు తెలిపారు. విశ్వక్షేణారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, సూత్రధారణ, యజ్ఞోపవేత ధారణ, తలంబ్రాలు తదితర పూజాది కార్యక్రమాలతో కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చదువులమ్మ చెట్టు నీడలో...



కె.గంగవరంలో కలుసుకున్న 2009-10 బ్యాచ్ విద్యార్థులు

కె.గంగవరం: స్థానిక ఉన్నత పాఠశాలలో 2009-10 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులంతా సోమవారం ఒకే చోట ఏకమై సంతోషంగా గడిపారు. వారు ఒకరిని ఒకరు పలకరించుకుని సంతోషంగా గడపడమే కాకుండా పాఠశాల అభివృద్ధిలో తమ వంతు సహాయం చేయడానికి సిద్ధమయ్యారు. ఉదయం నుంచి పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టేజీపై విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అనంతరం బ్యాచ్‌ల వారీగా ఫొటోలు తీయించుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులకు పూలదండలు, శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలసి సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఉల్లాసంగా గడిపారు.